చెరకు మద్దతు ధర రూ.3151

రేగిడి, నవంబరు19(ఆంధ్రజ్యోతి): ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారం 2024-25 ఏడాదికి సంబంధించి టన్ను చెరకు మద్దతు ధర రూ.3151 చెల్లిస్తామని సీనియర్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ వి.పట్టాభిరామిరెడ్డి, డీజీఎం కేన్ ఆర్.రమేష్‌లు ఒక ప్రకటనలో మంగళవారం తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే టన్నుకు రూ.71 అదనంగా చెల్లిస్తామన్నారు. ఈ ఏడాది క్రషింగ్ లక్ష్యం 4 లక్షల మూడు వేల టన్నులుగా నిర్ణయించామన్నారు. గత ఏడాది ప్రకటించిన ప్రోత్సాహకాలను ఈ గానుగ సీజన్ తరువాత చెల్లిస్తామని పేర్కొన్నారు.



నడవలేక ఆస్పత్రి ముందు విశ్రాంతి తీసుకుంటున్న వృద్ధుడు

ఆస్పత్రులు మారలే!

ఆంధ్రజ్యోతి విజిట్

- అరకొర వైద్యం.. రోగుల ఇబ్బందులు
- ఆలస్యంగా విధులకు వైద్యులు, సిబ్బంది
- మౌలిక సౌకర్యాలు కూడా కరువే
- కొన్నిచోట్ల చాలీచాలని గదులు

పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రుల నుంచి జిల్లా కేంద్ర ఆస్పత్రి వరకూ అన్నింటిదీ ఒకటే బాట. అవే సమస్యలు.. అవే పరిస్థితులు. వైద్యులు, సిబ్బంది సకాలంలో రావడం లేదు. రోగులకు మెరుగైన వైద్యం అందడం లేదు. రోగులు నిరీక్షించి నిరాశతో వెనుతిరగడం సర్వసాధారణంగా మారింది. సుదూర ప్రాంతాల నుంచి ఎంతో ప్రయాస పడి.. ఇబ్బందులు ఎదుర్కొని.. రవాణా చార్జీలు భరించి జిల్లా కేంద్ర ఆస్పత్రికి వస్తుంటారు. అంత ప్రయాసతో పెద్దాస్పత్రిని ఆశ్రయించే వారిని కనీసం ఆదరించడం లేదు. క్యూలో ఉన్నవారిని కాదని ఆలస్యంగా వచ్చిన వారిని వైద్యుని వద్దకు తీసుకువెళ్తున్నారు. ఆర్థోపెడిక్, సర్జికల్ ఓపీ వైద్యులు మంగళవారం చాలా ఆలస్యంగా విధులకు రావడం కనిపించింది. విభిన్నప్రతిభావంతుల అవస్థలు అన్నీఇన్నీ కావు. మెయిన్‌గేటు వద్ద కల్వర్టుపై ఇనుపరాడ్లతో ఏర్పాటు చేసిన దారిని దాటడం వారికి కష్టంగా ఉంటోంది. ప్రత్యామ్నాయం చూపడం లేదు. ఇక ఇతర ఆస్పత్రుల్లోనూ ఏమాత్రం మార్పు రాలేదు. రాజాం ఆస్పత్రిలో ఒకే గదిలో ఇద్దరు, ముగ్గురు వైద్యులు రోగులను పరీక్షిస్తున్నారు. గజపతినగరం ఆస్పత్రిలో ఎప్పటికప్పుడే ఒక బెడ్‌పై ఇద్దరు రోగులకు చికిత్స అందిస్తున్నారు. బాడంగి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో జనరేటర్ పనిచేయడం లేదు. చీపురుపల్లి ఆస్పత్రిలో ఎక్స్‌రే రిపోర్టు కోసం రోజుల తరబడి నిరీక్షిస్తున్నారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరినా హాస్పిటల్స్‌లో ఏమాత్రం మార్పు రాలేదు. సర్కారు ఆస్పత్రులను 'ఆంధ్రజ్యోతి' మంగళవారం విజిట్ చేయగా అన్నిచోట్లా సమస్యలు కనిపించాయి. రోగుల ఇబ్బందులు ప్రస్ఫుటమయ్యాయి.

6లో

జిల్లా కేంద్ర ఆస్పత్రిలో వైద్యుని కోసం నిరీక్షిస్తున్న వృద్ధురాలు





విజయనగరం: కేంద్ర ఆస్పత్రి లోపల రోగుల నిరీక్షణ, ఆక్సిజన్ మాస్క్‌తో ఓ మహిళ

జూట్‌మిల్లుల సమస్యలపై

చర్చలు వాయిదా

- డిసెంబరు 4, 17 తేదీల్లో భేటీ ఖరారు చేస్తూ జేసీఎల్ ప్రకటన

నెల్లిమర్ల/ కొత్తవలస, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల జూట్‌మిల్లు ఎప్పుడు తెరుచుకుంటుందో తెలియని పరిస్థితి నెలకొంది. కార్మికుల సమస్యలపై విశాఖపట్నం జాయింట్ లేబర్ కమిషనర్(జేసీఎల్) కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన ఉమ్మడి చర్చలు ఫలితాన్ని ఇవ్వలేదు. యాజమాన్య ప్రతినిధులు హాజరు కాకపోవడంతో జెసీఎల్ ఈ చర్చలను వచ్చే నెల 17వ తేదీకి వాయిదా వేసింది. మిల్లును తక్షణం తెరిపించాలని, రిటైర్డు కార్మికులకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలను అందివ్వాలని కార్మికులు కోరుతున్న విషయం తెలిసిందే. చర్చలకు శ్రామిక సంఘం నాయకులు చిక్కాల వెంకటగోవిందరావు, బేతా అప్పారావు, సముద్రపు సత్యనారాయణ , ఇఫ్టూ నాయకులు నామాల తిరుపతిరావు, టి.అప్పారావు, గంటా పాపారావు, కాళ్ల అప్పలసూరి, సీఐటీయు నాయకుడు కిల్లంపల్లి రామారావు తదితరులు హాజరయ్యారు.

- కొత్తవలస జూట్‌మిల్లులో విధించిన అక్రమ లాకౌట్‌కు సంబంధించి డిసెంబర్ 4న చర్చలే చివరి చర్చలని యాజమాన్యానికి జేసీఎల్ స్పష్టం చేసింది. మండలంలోని తుమ్మికాపల్లి పంచాయతీ పరిధిలో నున్న ఉమాజూట్ మరియు ట్వైన్ మిల్లులో జూలై 15 నుంచి లాకౌట్ అమలు చేశారు. సమస్యపై చర్చించేందుకు విశాఖలోని జేసీఎల్ వద్ద మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. జూట్ మిల్లు యాజమాన్య ప్రతినిధులు సమావేశానికి రాకుండా తమకు నెల రోజులు వ్యవధి ఇస్తే కార్మికులతో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని మెయిల్ ద్వారా జేసీఎల్‌కు సమాచారం ఇచ్చారు. ఇప్పటికే తొమ్మిదిసార్లు నిర్వహించిన చర్చలకు యాజమాన్యం గైర్హాజరైనందున నెల రోజులపాటు గడువు ఇవ్వడం కుదరదని యాజమాన్యంకు జేసీఎల్ స్పష్టం చేసింది.

డిసెంబర్ 4న తప్పనిసరిగా చర్చలకు రావాలని చెప్పింది. ఈ విషయాన్ని కార్మిక సంఘం నాయకులు గణేష్ పండా, రాంబాబు తెలిపారు.



జేసీఎల్‌కు సమస్యలపై వివరిస్తున్న కార్మిక సంఘాల నాయకులు



బాడంగి మండలం భీమవరంలో హౌస్ హోల్డ్ జియోట్యాగింగ్ చేస్తున్న ఉద్యోగులు

చురుగ్గా ప్రక్రియ

జిల్లా వ్యాప్తంగా హౌస్‌హోల్డ్ జియో ట్యాగింగ్ చురుగ్గా కొనసాగుతోంది. లెక్క పక్కాగా ఉండేటట్లు జియోట్యాగింగ్ చేయాలని ఇప్పటి వరకు 52 శాతానికి పైగా మ్యాపింగ్ చేశాం. మిగిలిన హౌస్‌ట్యాగింగ్ మరో వారం రోజుల్లో పూర్తి అవుతుంది. ఇంటింటికీ వెళ్లి సచివాలయ సిబ్బంది ట్యాగింగ్ చేస్తున్నారు. అక్కడక్కడా సాంకేతిక సమస్యలు వస్తున్నాయి. కానీ వాటిని అధిగమించి పూర్తిచేస్తున్నారు. సచివాల ఉద్యోగులు విధిగా తమకు కేటాయించిన ఇళ్లకు జియో ట్యాగింగ్ చేయాల్సిందే. హౌస్ మ్యాపింగ్ తోపాటు, ఫొటో తీసుకుని గ్రామ, వార్డు సచివాలయ వెబ్‌సైట్‌లో పొందుపరచాలి.

- అంబేడ్కర్, కలెక్టర్

ప్రతి ఇంటి లెక్క పక్కా!

- జిల్లాలో హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్
- సచివాలయ ఉద్యోగులకు బాధ్యతలు
- అక్కడక్కడా సాంకేతిక సమస్యలు
- అధిగమిస్తామంటున్న అధికారులు
- జిల్లాలో 6,38,787 గృహాలు

విజయనగరం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): విజయవాడ నగరం ఇటీవల వరదలకు మునిగిపోయింది. లక్షలాది మంది నిరాశ్రయులయ్యారు. వేలాది ఇళ్లు ముంపులోనే రోజుల తరబడి ఉండిపోయాయి. బాధితులకు సరైన ఆహారం అందలేదు. మంచి నీటికి కూడా ఇబ్బందిపడ్డారు. సాయం చేసేందుకు యంత్రాంగం సిద్ధంగా ఉన్నా.. బాధితులు ఎవరు? వారి స్థితిగతులు ఏంటి? ఏ ప్రాంతంలో, ఏ ఇంట్లో నివాసముంటున్నారు? వారి చుట్టుపక్కల హద్దులు ఏంటి? అన్నది తెలియకుండా పోయింది. దీంతో వరద బాధితులకు సాయం అందించడంలో కాస్త జాప్యం జరిగింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వినూత్న ఆలోచన చేసింది. విపత్తుల సమయంలో సాయం అందించడంతో పాటు ప్రతి నివాసితుడి వివరాలు సులువుగా తెలుసుకునేందుకు 'హౌస్ హోల్డ్ జియోట్యాగింగ్' చేయాలని నిర్ణయించింది. ఒక వ్యక్తి పేరు, ఆధార్ నంబర్, ఫోన్ నంబర్, ఇంటి నంబరుతో ఇళ్ల వివరాలు ఇట్టే తెలిసిపోయే వీలుగా జియోట్యాగింగ్‌ను చేయిస్తోంది. ఈ కీలక బాధ్యతలను ప్రభుత్వం సచివాలయ ఉద్యోగులకు అప్పగించింది. ప్రకృతి విపత్తుల సమయంలో చిన్న ఆధారాలతో ఆచూకీ కనుగొనేలా ఈ సరికొత్త విధానం ఉపయోగపడనుంది. ప్రస్తుతం జియో ట్యాగింగ్ ప్రక్రియ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చురుగ్గా జరుగుతోంది.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో 626 గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి. మొత్తం 10,601 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఈ నెల 12 నుంచి ప్రక్రియ ప్రారంభమైంది. ప్రతి ఉద్యోగి క్లస్టర్లలో హౌస్ జియో ట్యాగింగ్ చేయాల్సి ఉంటుంది. అంటే 100 పైగా ఇళ్ల వరకూ చేయాల్సి ఉంది. జిల్లాలో 6,38,787 ఇళ్లు ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఇప్పటివరకూ లక్ష ఇళ్ల వరకు మాత్రమే ప్రక్రియ పూర్తయినట్టు తెలుస్తోంది. సచివాలయ పరిధిలోని ఉద్యోగులందరికీ ఈ బాధ్యతలను అప్పగిస్తే కొన్నిశాఖల కార్యదర్శులు మాత్రమే ట్యాగింగ్ ప్రక్రియలో పాల్గొంటున్నట్టు తెలుస్తోంది. ప్రధానంగా పంచాయతీ కార్యదర్శులు, సంక్షేమ, ఇంజనీరింగ్ సహాయకులు, మహిళా పోలీసులు మాత్రమే పాల్గొంటున్నారని.. మిగతా వారు డుమ్మా కొడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందుకే ఈ ప్రక్రియలో జాప్యం జరుగుతోందని తెలుస్తోంది. పర్యవేక్షణ బాధ్యతలను మండలాల్లో ఎంపీడీవోలకు, మునిసిపాల్టీల్లో కమిషనర్లకు అప్పగించారు. మరోవైపు సాంకేతిక సమస్యలతో సైతం ఇబ్బందులు ఎదురవుతున్నట్టు సమాచారం. వేలిముద్రలు అనుసంధానం చేయడంలో కొన్నిప్రాంతాల్లో డివైస్‌లు మొరాయిస్తున్నాయి. మొబైల్ నెట్‌వర్క్ సమస్య కూడా ఉంది. దీంతో మ్యాపింగ్‌నకు సమస్య ఏర్పడుతోంది. ఈ ప్రక్రియ పూర్తయితే కానీ జిల్లాలో నివాసాలపై ఒక స్పష్టత రాదు.

ప్రతిష్ఠాత్మకంగా..

కూటమి ప్రభుత్వం హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్‌ను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. రాష్ట్రంలోని ప్రతి ఇంటినీ ప్రభుత్వంతో అనుసంధానించాలన్న కృతనిశ్చయంతో ఉంది. గతంలో సంక్షేమ పథకాల ఆధారంగా మ్యాపింగ్ ఉండేది. రేషన్‌కార్డులకు, పింఛన్లకు ఇలా వేర్వేరుగా మ్యాపింగ్ ఉండేది. అయితే ఆ మ్యాపింగ్ కేవలం పథకాల పంపిణీకి మాత్రమే ఉపయోగపడేది. అందుకే వేర్వేరుగా కాకుండా అన్నిరకాల సంక్షేమ పథకాలకు, అవసరాల కోసం ఒకే జియో ట్యాగింగ్ చేయాలని భావిస్తోంది. ప్రతి ఇంటికి సంబంధించి రేఖాంశం, అక్షాంశాన్ని (మిగతా 8వ పేజీలో..)

ఆశాల కలెక్టరేట్ ముట్టడి

ఆశాకార్యకర్తలు కలెక్టరేట్‌ను మంగళవారం ముట్టడించారు. ప్రభుత్వం కనీస వేతనాలు అమలు చేయాలని, న్యాయంగా దక్కాల్సిన సెలవులు ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు. ఆశాలు జిల్లా నలుమూలల నుంచి రావడంతో కలెక్టరేట్ ప్రాంగణం నినాదాలతో హోరెత్తింది.

7లో



రైలు ఢీకొని 80 గొర్రెలు మృతి

- కుక్కలు బెదిరించడంతో పట్టాలపైకి పరుగెత్తిన మూగజీవాలు

జామి మండలం యాతపాలెం వద్ద రైలు ఢీకొని 80 గొర్రెలు మృతిచెందాయి. కుక్కలు మొరుగుతూ వాటిపైకి రావడంతో బెదిరిపోయిన మూగజీవాలు ఒక్కసారిగా పట్టాలపైకి పరుగులు పెట్టాయి. ఇదే సమయంలో రైలు రావడంతో రెప్పపాటులో ప్రాణాలు కోల్పోయాయి. మరో 40 గొర్రెలకు గాయాలయ్యాయి.

7లో

పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రతిపాదనలు ఇవ్వండి

- రామతీర్థం, చింతపల్లి, తాటిపూడిలో వసతుల కల్పనకు ప్రాధాన్యం: కలెక్టర్ అంబేడ్కర్



విజయనగరం కలెక్టరేట్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పర్యాటక ప్రదేశాల్లో వసతుల కల్పనకు ప్రతిపాదనలు ఇస్తే వాటిని ప్రభుత్వానికి పంపిస్తామని కలెకర్ అంబేడ్కర్ చెప్పారు. రామతీర్థం తీర్థ యాత్ర పర్యాటక ప్రాంతంగా, చింతపల్లిలో బీచ్ టూరిజం ప్రాంతంగా, తాటిపూడి రిజర్వాయర్‌ను విహారయాత్ర ప్రదేశంగా పరిగణించి ఆయా ప్రాంతాల్లో వసతులు కల్పనకు ప్రతిపాదనలు చేయాలన్నారు. అదేవిధంగా విజయనగరానికి సమీపంలో ఉన్న రామానారాయణం వద్ద ఉన్న కోనేరును అభివృద్ధి చేసేందుకు కూడా ప్రతి పాదనలు రూపొందించాలని ఆదేశించారు. పర్యాటక శాఖ కార్యదర్శికి ప్రతిపాదనలు అందజేయనున్నట్లు చెప్పారు. సీపీవో, పర్యాటక అధికారులతో మంగళవారం సాయంత్రం కలెక్టర్ సమీక్షించారు. చింతపల్లి బీచ్ వద్ద సముద్ర తీర పర్యాటకం అభివృద్ధిలో భాగంగా ప్రస్తుతం కాటేజీల నిర్మాణం, రెస్టారెంట్, చిల్డ్రన్ పార్కు తదితర వాటిపై దృష్టిసారించామన్నారు. తాటిపూడిలో పర్యాటకుల కోసం బోట్లను నడిపేందుకు ప్రభుత్వం ఇప్పటికే అనుమతి ఇచ్చినందున కాటేజీల వరకూ రోప్ బ్రిడ్జి నిర్మాణం, అక్కడున్న పది ఎకరాల్లో కేఫ్ టేరియా, బర్డ్ పార్కు, కన్వెన్షన్ హాల్, థియేటర్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు.

- నెలలు నిండకుండా పుట్టిన పిల్లల్లో దృష్టిలోపాలు వచ్చే అవకాశాలు ఉంటున్నాయని అందువల్ల అటువంటి వారికి కంటి పరీక్షలు చేయించడంలో తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలని కలెక్టర్ అంబేడ్కర్ సూచించారు. ప్రపంచ ప్రిమెచ్యూర్‌డే నడకను మంగళవారం కలెక్టరేట్ వద్ద ఆయన ప్రారంభించారు.
- రానున్నరోజుల్లో జిల్లాలో అనారోగ్యంతో ఏ ఒక్క శిశువు జన్మించకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. కిశోర్ వికాసం కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర స్థాయిలో శిక్షణ పొందిన శిక్షకులను ఉద్దేశించి కలెక్టరు మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో మాట్లాడారు.
- మరుగుదొడ్డి అనేది ఆత్మ గౌరవానికి చిహ్నమని, ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి తప్పనిసరిగా ఉండాలని, లేని వారికి వెంటనే మంజూరు చేస్తామని కలెక్టరు అంబేడ్కర్ తెలిపారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవంలో భాగంగా కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

ఆస్పత్రులు మారలే!



విజయనగరం: కిటకిటలాడుతున్న జిల్లా కేంద్ర ఆస్పత్రి ఓపీ విభాగం

ఆంధ్రజ్యోతి విజిట్

- అరకొర వైద్యం
- ఆలస్యంగా విధులకు వస్తున్న వైద్యులు, సిబ్బంది
- రోగులకు మౌలిక సౌకర్యాలు కరువు
- కొన్నింటికీ చాలీచాలని గదులు

వైద్యం కోసం వెళుతున్న రోగులు నిరాశతో వెనుతిరుగుతున్నారు. వైద్యం అందక కొందరు.. అరకొర పరీక్షలు చేయించుకుని ఇంకొందరు తిరుగుముఖం పడుతున్నారు. బెడ్‌లూ సరిపోని దుస్థితి జిల్లాలోని సర్కారు ఆస్పత్రుల్లో నెలకొంది. అన్నిచోట్లా వైద్యులు, సిబ్బంది కొరత ఉంది. రాజాం వంటి చోట్ల చాలీచాలని గదులతో వైద్యులూ ఇబ్బంది పడుతున్నారు. జిల్లా ప్రజలకు పెద్ద దిక్కుగా ఉండాల్సిన జిల్లా కేంద్ర ఆస్పత్రిలోనూ అనేక సమస్యలు ఉన్నాయి. ప్రధానంగా ఎవరూ సమయపాలన పాటించడం లేదు. సకాలంలో వైద్యం అందక రోగులు చాలా ఇబ్బంది పడుతున్నారు. గంటలకొద్దీ నిరీక్షిస్తున్నారు.



విజయనగరం: ఎముకల విభాగంలో వైద్యుడు లేక ఖాళీగా వున్న కుర్చీ

నచ్చినప్పుడు వస్తున్నారు..

- కేంద్రాసుపత్రిలో సమయపాలన పాటించని వైద్యులు, సిబ్బంది

విజయనగరం నవంబరు 19 (ఆంధ్రజ్యోతి)/ రింగురోడ్డు/ రూరల్/ కలెక్టరేట్/టౌన్: జిల్లా కేంద్రాసుపత్రికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వారికి సమయానికి వైద్యం అందని పరిస్థితి కనిపించింది. వేర్వేరు చోట్ల వారంతా వైద్యుల కోసం ఎదురుచూశారు. డాక్టర్లు, సిబ్బంది సమయపాలన పాటించడం లేదని పలువురు రోగులు తెలిపారు. అక్కడున్న సెక్యూరిటీ సిబ్బంది వారికి తెలిసిన వారిని, సిఫార్సులతో వచ్చేవారిని వైద్యుల వద్దకు ముందు పంపించారు. దీంతో క్యూలో ఉన్నవారంతా నిలదీశారు. ఇదే పరిస్థితి రోజూ ఉంటోందని రోగులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థోపెడిక్, సర్జికల్ ఓపీ వైద్యులు ఉదయం 9 గంటకు రావాల్సి ఉండగా 9.40 గంటలకు వచ్చారు. ఎక్స్‌రే విభాగం సిబ్బంది కూడా ఆలస్యంగా రావడంతో టెక్నీషియన్‌పై రోగులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఓపీ 1100 వరకూ వచ్చింది. సదరం సర్టిఫికెట్ జారీకి కూడా ఇక్కడే వైద్య పరీక్షలు నిర్వహిస్తుండడంతో వారు కూడా ఎక్కువ సేపు వైద్యులు, సిబ్బంది కోసం నిరీక్షించడం కనిపించింది. ఫిజియోథెరపీ విభాగంలో నలుగురు ఉండాల్సిన చోట కేవలం ఇద్దరే ఉంటున్నారు. విధుల పట్ల వైద్య సిబ్బంది నిర్లక్ష్యంపై కేంద్రాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమణి వద్ద ప్రస్తావించగా వైద్యసేవల్లో డాక్టర్లు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించినా.. రోగులకు ఇబ్బంది కలిగేలా ప్రవర్తించినా ఆధారాలతో మా దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామన్నారు.



ఎక్సరే విభాగంలో టెక్నీషియన్ లేక ఇలా..



గజపతినగరం ఏరియా ఆసుపత్రిలో రోగులు

సమయానికి రావడం లేదు..



మోకాళ్ల నొప్పితో బాధపడుతూ మంగళవారం జిల్లా కేంద్రాసుపత్రిలోని ఆర్థో విభాగానికి వచ్చాను. ఉదయం 8.30 గంటలకే చేరుకుని ఓపీ రాయించుకుని లైనులో కూర్చున్నా. 9 గంటలకు రావాల్సిన వైద్యులు 9.40కు వచ్చారు. అంతవరకు నిరీక్షించాను. అక్కడి సిబ్బంది లైనులో ఉన్నవారిని కాకుండా వేరేవారిని పంపించేందుకు ప్రయత్నించారు. దీనిని ప్రశ్నించాను. వైద్యులు సకాలంలో వస్తే ఈ పరిస్థితి ఉండదు కదా!

-సత్యనారాయణ, ఉడాకాలనీ, విజయనగరం

రాజాం ఆస్పత్రిలో చాలని గదులు..

రాజాం రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రాజాం సామాజిక ఆసుపత్రిలో నాడు-నేడు పనులు ప్రారంభమై నాలుగేళ్లు కావొస్తోంది.. కనీస పురోగతి లేదు. రోగులు, అటు వైద్యులు, సిబ్బంది నానా అవస్థలకు గురవుతున్నారు. ఆసుపత్రి అభివృద్ధి కోసం నాబార్డు మంజూరు చేసిన రూ.6.80 కోట్ల నిధులతో 2020 అక్టోబరు 26న ప్రారంభమైన అభివృద్ధి పనుల్లో ఏమాత్రం ప్రగతి లేదు. రోగులుండాల్సిన వార్డులో నిర్మాణ సామగ్రి దర్శనమిస్తోంది. వైద్యులకు సరిపడినన్ని గదులు లేక ఒకే గదిలో ఇద్దరు, ముగ్గురు వైద్యులు రోగులను పరీక్షిస్తున్నారు. ఒకే బెడ్‌పై ఇద్దరేసి రోగుల్ని ఉంచి వైద్యం అందివ్వడం మంగళవారం కనిపించింది.



వార్డుల్లో నిర్మాణ మెటీరియల్

బాడంగిలో పనిచేయని జనరేటర్



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

బాడంగి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బాడంగి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో నిత్యం 200 మంది ఓపీ నమోదవుతోంది. పూర్తి స్థాయిలో వైద్యం అందించ డంలేదని రోగుల కుటుంబ సభ్యులు 'ఆంధ్రజ్యోతి' వద్ద మంగళవారం ఆవేదన వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో జనరేటర్ ఉన్నప్పటికీ కరెంటు పోతే ఆన్ చేయడం లేదు. నిర్వహణ నిధులు రావడం లేదంటున్నారు. పోస్టుమార్టం గదిలో ఫ్రీజర్ లేదు. పూర్తిస్థాయిలో వైద్యులు లేక కొన్ని సందర్భాల్లో ఇబ్బంది పడుతున్నామని, జనరేటర్‌కు పెట్రోల్ నిధులు మంజూరు చేయడం లేదని సీహెచ్‌సీ వైద్యుడు నాగేశ్వరరావు తెలిపారు.

ఎక్సరే రిపోర్టు కోసం నిరీక్షణే..



చీపురుపల్లి ఏరియా ఆసుపత్రి

చీపురుపల్లి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఏరియా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ అయిన చీపురుపల్లి సామాజిక ఆరోగ్య కేంద్రానికి భవనాల కొరత పీడిస్తోంది. వంద పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ అయిన తరువాత అదనపు భవనాల నిర్మాణానికి గత ప్రభుత్వంలో ఆమోదం లభించినా పనులు జరగలేదు. చాలీచాలని భవనాల్లో ఆసుపత్రిని నడుపుతున్నారు. రేడియాలజిస్ట్ లేక ఎక్స్‌రే తీయించుకుంటున్న రోగులు ఫలితాల కోసం రోజుల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. డెర్మటాలజిస్ట్, జనరల్ సర్జన్ లేరు. ఎన్‌సీడీ విభాగంలో మెడికల్ ఆఫీసరు లేకుండానే రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. స్టాఫ్ నర్సుల కొరత ఉన్నప్పటికీ ఉన్న వారితోనే నెట్టుకొస్తున్నారు.

ఏరియా ఆసుపత్రి.. పూర్తిస్థాయిలో అందని సేవలు..

పాలకొండ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పాలకొండ ఏరియా ఆసుపత్రిలో మంగళవారం వైద్యులు, సిబ్బంది సకాలంలో విధులకు హాజరయ్యారు. ఓపీ కోసం ఆన్‌లైన్ ఆఫ్‌లైన్ ద్వారా పేషెంట్ల వివరాలు నమోదు చేశారు. ఏరియా ఆసుపత్రిలో వైద్య నిపుణులు అందుబాటులో ఉన్నప్పటికీ రేడియాలజిస్ట్ లేరు. దీంతో స్కానింగ్ గదికి తాళం వేశారు. వారంలో రెండు రోజులు మాత్రమే సీతంపేట ఏరియా ఆసుపత్రి నుంచి రేడియాలజిస్ట్ వచ్చి స్కానింగ్‌లు చేస్తుంటారు. ఇటీవల పాడేరు నుంచి ఎంబీబీఎస్ వైద్యుడిని రేడియాలజిస్ట్‌గా నియమించినప్పటికీ ఇప్పటివరకు విధుల్లో చేరలేదు. ఎనిమిది మంది స్టాఫ్‌నర్సుల కొరత వెంటాడుతుంది. వైద్య సిబ్బంది పూర్తిస్థాయిలో లేకపోవడంతో అక్కడున్న మిగతా సిబ్బంది, రోగులపై ఆ ప్రభావం పడుతోంది. ఆసుపత్రి ఆపరేషన్ థియేటర్‌లో ఎక్విప్‌మెంట్ లేదు. జనరల్ వార్డుల్లో కూడా మరమ్మతు పనులు చేయాల్సి ఉంది. పూర్తి స్థాయిలో కాపౌండ్ వాల్ లేకపోవడంతో ఆసుపత్రి ప్రాంగణం అధ్వానంగా మారింది. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. సెప్టిక్ ట్యాంకులు పైకప్పులు కూలిపోగా, కాలువలు పూడికలతో నిండి పోయాయి. దీంతో వాడుక నీరు బయటకు వెళ్లలేని పరిస్థితి. దీంతో రోగులకు అవస్థలు తప్పడం లేదు.



రేడియాలజిస్ట్ లేక తాళం వేసిన స్కానింగ్ గది

అప్‌గ్రేడ్ అయినా.. అవే సమస్యలు

సాలూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సాలూరు ఏరియా ఆసుపత్రిలో మంగళవారం వైద్యులంతా సకాలంలో విధులకు హాజరయ్యారు. ఓపీ 200 దాటి నమోదవగా.. సుమారు 20 మంది వైద్యులు రోగులకు వైద్య సేవలు అందించారు. 80 బెడ్లు ఉన్నా.. అవి ఏ మాత్రం చాలడం లేదు. దీంతో ఇన్‌పేషెంట్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక మంచంపై ఇద్దరేసి చొప్పున సర్దుకుని వైద్యసేవలు పొందుతున్నారు. భవన నిర్మాణాలు పూర్తికాకపోవడంతో ఓ వార్డులోనే వంటలు చేసి రోగులకు భోజనం అందిస్తున్నారు. ఇదిలా ఉండగా సాయంత్రానికి 35 మంది ఇన్‌పేషెంట్లుగా చేరారు. అయితే వారికి వరండాల్లోని మంచాలపై వైద్య సేవలు అందించారు. సాలూరు ఏరియా ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసినప్పటికీ భవన నిర్మాణాలు పూర్తికాకపోవడంతో వైద్యసిబ్బంది, రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు.



వరండాలో వైద్య సేవలు పొందుతున్న రోగులు

చాలీచాలని పడకలు..

గజపతినగరం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గజపతినగరం ఏరియా ఆసుపత్రిలో పడకలు చాలక రోగులు ఇబ్బందులు పడడం మంగళవారం కనిపించింది. గజపతినగరం, దత్తిరాజేరు, బొండపల్లి మండలాలతో పాటు సాలూరు నియోజకవర్గానికి చెందిన మెంటాడ మండల ప్రజలు కూడా ఈ ఆస్పత్రిని ఆశ్రయిస్తుంటారు. ప్రతి రోజు 300నుంచి 350 వరకు ఓపి ఉంటోంది. రోగులు సంఖ్య పెరగడంతో వైద్య సేవలు అందించలేక జిల్లా కేంద్ర ఆసుపత్రికి వెళ్లమంటున్నారని రోగులు వాపోయారు. ఎప్పటికప్పుడే ఒక బెడ్ పై ఇద్దరు రోగులకు చికిత్స అందిస్తున్నారు. రోగుల సంఖ్య పెరుగుతున్నా వైద్యులను పెంచడం లేదు. జనరల్ మెడిసన్, జన రల్ సర్జరీ, మత్తు వైద్యులు, రేడియాలజీ, సివిల్ సర్జన్ (ఆర్‌ఎం ఓ)తో పాటు సాధారణ వైద్యుల కొరత ఉంది. ఆసుపత్రిలో ఆరుగురు వైద్య సిబ్బంది కొరత ఉందని, సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని సూపరింటెండెంట్ డాక్టర్ జగదీష్‌కుమార్ తెలిపారు.

సాయంత్రమైతే రోగులు ఇంటికే...



రేగిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇదే..

జియ్యమ్మవలస, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గుమ్మలక్ష్మీపురం మండలం రేగిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యాధికారులు ఉండాలి. అయితే వారిలో ఒకడాక్టర్ ఎం.వినోద్‌కుమార్‌ను డిప్యుటేషన్ మీద డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో ప్రోగ్రాం ఆఫీసర్‌గా వేశారు. మరొక డాక్టర్ వై.శంకరరావు జిల్లా కేంద్రం పార్వతీపురం నుంచి రోజూ 50 కిలో మీటర్లు ప్రయాణించి ఈ పీహెచ్‌సీకి రావాల్సి ఉంది. జిల్లా కేంద్రంలో సమావేశాలుంటే ఆయన విధులకు రారని పీహెచ్‌సీ సిబ్బందే చెబుతున్నారు. మధ్యాహ్నం 3 గంటల తరువాత ఆసుపత్రిలో వైద్యాధికారి ఉండడం లేదని మరోవైపు స్థానికులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా మంగళవారం సాయంత్రం ఈ పీహెచ్‌సీని విజిట్ చేయగా.. ల్యాబ్ టెక్నీషియన్ బి.రాము రోగులకు వైద్య సేవలు అందించారు. పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులు ఇచ్చారు. ఆయన వెంట సూపర్‌వైజర్ ఎస్.రమణ, హెల్త్ అసిస్టెంట్ రమేష్‌బాబు, కంటింజెంట్ వర్కర్ ఎ.సింహాద్రి ఉన్నారు. ఇది 24 గంటల పీహెచ్‌సీ అయినప్పటికీ ఇన్‌పేషెంట్లను సాయంత్రం వరకు ఉంచి మళ్లీ ఉదయాన్నే రమ్మని సిబ్బంది చెబుతున్నారు.

పేరుకే జిల్లా ఆసుపత్రి..



బెలగాం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లా క్రేందాసుపత్రిని మంగళవారం విజిట్ చేయగా ఉదయం 10 గంటలకు వైద్యులంతా హాజరయ్యారు. వంద వరకు ఓపీ నమోదవగా.. 40 మంది డాక్టర్లు, 32 మంది నర్సులు విద్య సేవలు అందించారు. 150 పడకలకు గాను 150 మంది ఇన్‌పేషెంట్లు ఉన్నారు. ఎంఆర్‌ఐ స్కానింగ్, సదుపాయం లేకపోగా, ఐసీయూ నిరుపయోగంగా ఉండడంతో రోగులకు అవస్థలు తప్పడం లేదు. సీజన్‌లో బెడ్లు చాలక ఒక మంచంపై ఇద్దరు, ముగ్గురు చొప్పున సర్దుకోవాల్సి వస్తోంది. జిల్లా ఆసుపత్రిలో శానిటైజేషన్‌పై రోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు రోగులు ఆసుపత్రి వచ్చినప్పుడు సిబ్బంది పట్టించుకోక పోవండతో వారి బంధువులే వీల్ ఛైర్‌లో తీసుకెళ్లిన పరిస్థితి నెలకొంది. కాగా ప్రత్యేక వైద్య నిపుణులు లేకపోవడంతో అత్యవసర వేళల్లో ఎమర్జెన్సీ కేసులను విజయనగరం, విశాఖకు రిఫర్ చేస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అసెంబ్లీలో ఎమ్మెల్యేల గళం



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు లలితకుమారి, విజయచంద్ర, జయకృష్ణ

తాటిపూడికి బుచ్చి అప్పారావు పేరు పెట్టాలి: లలితకుమారి

శృంగవరపుకోట, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): 'తాటిపూడి జలాశయానికి స్వాతంత్ర్య సమరయోధుడు గొర్రిపాటి బుచ్చి అప్పారావు పేరు పెట్టాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు. ఐదు దశాబ్దాల పాటు ప్రజా సమస్యలపై ఆయన పోరాడారు. స్వాతంత్ర్యం వచ్చిన అనంతరం 1952లో జరిగిన మొదటి ఎన్నికల నుంచి రాజకీయాల్లో ఉన్నారు. తాటిపూడి నీటి కోసం ఆ రోజుల్లో ఆనకట్ట కట్టేందుకు రైతులను ఒప్పించారు. విరాళాలను సేకరించి నిర్మాణానికి సహకరించారు. ఆయన పేరును జలాశయానికి పెట్టాలని జిల్లా మంత్రి కూడా ప్రతిపాదన చేశారు. సీఎంకు వినతి పత్రం ఇచ్చారు. ఇలాంటి గొప్ప ప్రజా నాయకుడి పేరు జలాశాయానికి పెట్టాలని' మంగళవారం శాసనసభ ద్వారా శృంగవరపుకోట శాసన సభ్యురాలు కోళ్ల లలిత కుమారి విన్నవించారు.

పీజీ, డీగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలి: విజయచంద్ర

పార్వతీపురం, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం పార్వతీపురంలో పీజీ కళాశాల, బలిజిపేట మండలంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయంద్ర కోరారు. మంగళవారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ.. పార్వతీపురం విద్యార్థులు పీజీ విద్య కోసం దూర ప్రాంతాల్లో ఉన్న కళాశాలలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. ఇక బలిజిపేటలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయడం వల్ల పరిసర ప్రాంత విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు.

డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరించండి: జయకృష్ణ

పాలకొండ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పాలకొండ నగర పంచాయతీలో డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అసెంబ్లీలో కోరారు. దీనికి సంబంధించి స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ నుంచి నిధులు విడుదల చేయాలన్నారు. నగర పంచాయతీకి నాన్ అమృత్ పథకం కింద రూ.57.50 కోట్లతో రక్షిత నీటి పథకం మంజూరవగా.. ఇప్పటివరకు ఆరు కిలోమీటర్ల వరకు పైప్‌లైన్ పనులు పూర్తయ్యాయన్నారు. అయితే పూర్తిస్థాయిలో నీటి సరఫరాకు గాను నూతన అంచనా విలువతో నిధలు మంజూరు చేసి పాలకొండ నగర పంచాయతీ ప్రజల దాహార్తిని తీర్చాలని కోరారు.

ఐటీడీఏలను నిర్వీర్యం చేశారు: సంధ్యారాణి



పార్వతీపురం, నవంబరు19 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వం ఐటీడీఏలను నిర్వీర్యం చేసిందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. మంగళవారం అసెంబ్లీలో ఆమె మాట్లాడుతూ.. ఐదేళ్లు ఐటీడీఏలకు గిరిజనులు రాలేని పరిస్థితి కల్పించారని వైసీపీ సర్కారు తీరుపై ధ్వజమెత్తారు. గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించలేకపోయారని తెలిపారు. పాడేరు తదితర ప్రాంతాల్లో గంజాయి సాగుతో పాటు దౌర్జన్యాలు, తదితర వాటిపైన వైసీపీ దృష్టిసారించిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వ పాలనలో గిరిజనుల ఆర్థికాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. గత ప్రభుత్వ కాలంలో వివిధ ఉపాధి శిక్షణలకు చెల్లించాల్సిన బిల్లులకు మోక్షం కల్పిస్తామన్నారు.

అయినమా.. ఆగలేదు

- దుకాణాల్లో పనివారుగా బాలలు
- ఎన్ని కార్యక్రమాలు చేపట్టినా నిష్ప్రయోజనమే
- తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇస్తున్నా ఫలితమేదీ?
- నేడు అంతర్జాతీయ బాలల హక్కుల పరిరక్షణ దినం

బొబ్బిలి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ ముష్కాన్ కార్యక్రమంలో భాగంగా బొబ్బిలి పట్టణంలో బడికి వెళ్లకుండా బయట తిరుగుతున్న కొందరు బాలలను పోలీసులు మూడేళ్ల క్రితం గుర్తించారు. బడికి వెళ్లి చదువుకోకుండా వీధివీధినా తిరిగి చిరువర్తకం చేయడం, స్వాముల మాలలు వేసి భిక్షాటన చేయడం, వ్యర్థాలను ఏరుకోవడం వంటి పనులు చేస్తున్న ఐదుగురిని గుర్తించి అప్పటి ఏఎస్పీ గౌతమి శాలి కౌన్సిలింగ్ ఇచ్చారు. అందరూ కచ్చితంగా చదువుకోవాలని, బాలలతో పనులు చేయించరాదని హితవు పలికారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేద పిల్లలు ఉచితంగా చదువుకునేందుకు కల్పిస్తున్నాయని, వాటిని సద్వినియోగం కోరారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిని రప్పించి రోడ్లపై సంచరిస్తున్న బాలలను ఆమెకు అప్పగించారు. వారికి విద్యాబుద్ధులు నేర్పించాలని కోరారు. ఇది జరిగి మూడేళ్లు దాటిపోయాయి. పరిస్థితిలో ఏమాత్రం మార్పు లేదు.

- గత నెలలో ఆపరేషన్ స్వేచ్ఛ ఫేజ్-3 కార్యక్రమంలో భాగంగా సీఐ కటకం సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు, వివిధ శాఖల అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆరు షాపులలో పని చేస్తున్న ఆరుగురు బాలలను గుర్తించి వారి తల్లిదండ్రులకు అప్పగించారు. బాలలను పనిలో పెట్టుకున్న షాపుల యజమానులపై కేసులు నమోదు చేశారు. అప్పట్లో సీఐ మాట్లాడుతూ బాలలను శారీరక శ్రమతో కూడిన పనుల్లో వినియోగించడం చట్టరీత్యా నేరమన్నారు. ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నెల గడిచి పోయింది. ఇప్పటికీ పరిస్థితిలో మాత్రం మార్పు లేదు.
- అధికారులు ఎన్ని అవగాహన కార్యక్రమాలు చేపట్టినా, షాపుల్లో ఆకస్మిక తనిఖీలు చేస్తున్నా, కేసులు నమోదు చేస్తున్నా.. బాలలను మాత్రం పనిలో పెట్టుకోవడం ఆగడం లేదు. పట్టణంలో ఏదో ఒక షాపులో పనిచేస్తున్న బాలలే కనిపిస్తుంటారు. అధికారులు దాడులు చేసినప్పుడు మాత్రమే ఇలాంటివి వెలుగులోకి వస్తున్నాయి. పేదరికం, అవగాహన లేకపోవ డం, బాధ్యతారాహిత్యం కారణంగానే బాలకార్మికుల సంఖ్య పెరుగుతున్నారన్న అభిప్రాయాలు ఉన్నాయి. పటిష్టమైన చట్టాలున్నా కూడా వీరిని అరికట్టలేక పోతున్నారు.



షాపును తనిఖీ చేస్తున్న అధికారులు



బొబ్బిలిలో షాపులను తనిఖీ చేస్తున్న సీఐ సతీష్‌కుమార్(ఫైల్)

27 కేసులు నమోదు చేశాం..



గత ఏడాది 14, ఈ ఏడాది 13 కేసులు బాలకార్మిక నిరోధానికి సంబంధించిన కేసులు నమోదు చేశాం. నాలుగు మండలాల పరిధిలో తనిఖీలు నిర్వహించాం. బాలలను స్కూళ్లలో చేర్పించాం. వారికి ప్రోత్సాహకంగా రూ.42,500 ఇచ్చాము. 14 ఏళ్ల లోపు బాలలను వినియోగించుకుంటున్న వారిపై మూడు కోర్టు కేసులు నమోదు చేశాం.

-గౌరీశంకరావు, అసిస్టెంట్ లేబర్ అధికారి, బొబ్బిలి

ఆశా కార్యకర్తల ఆందోళన



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న ఆశా కార్యకర్తలు

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆశ కార్యకర్తలు కదం తొక్కారు. సమస్యలు పరిష్కరించాలంటూ కలెక్టరేట్‌ను ముట్టడించారు. కనీశ వేతనాలు అమలు చేసి, ప్రభుత్వ సెలవులు ఇవ్వాలంటూ పెద్ద ఎత్తున డిమాండ్ చేశారు. దీంతో కలెక్టరేట్ ఆవరణ ఆశా కార్యకర్తలతో కిటకిటలాడింది. సమస్యల పరిష్కారం కోసం వీరంతా మంగళవారం కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తల సంఘ నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అనేక విధాలుగా నష్టపోయామని తెలిపారు. వేతనాలు పెంచకపోవడం వల్ల ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను జీవోలు రూపంలో ఇవ్వాలని కోరారు. వేతనాలు పెంచి, పని భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. సంబంధం లేని సర్వేలు అప్పగించవద్దని కోరారు. ప్రభుత్వ సెలవులు ఇవ్వాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని ,ఉద్యోగ విరమణ బెనిఫిట్స్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గుర్ల మండలం నాగలవలస ఆశా కార్యకర్త పూర్ణిమ డయేరియాతో మరణించిందని... ఆమె కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు బి.సుధారాణి, కె.వెంకటలక్ష్మి, కర్రి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

8న భగవద్గీత పఠన పోటీలు

రాజాం రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వికాసతరంగిణి ఆధ్వర్యంలో వచ్చేనెల 8న రాజాంలోని సంస్థ కార్యాలయంలో భగవద్గీత 12వ అధ్యాయం పై శ్లోకపఠన పోటీలు నిర్వహించనున్నట్లు సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ టీటీవీ రమణమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. మూడు నుంచి అయిదేళ్ల లోపు చిన్నారులు 12వ మొదటి అయిదు శ్లోకాలు, రెండు నుంచి అయిదు తరగతుల విద్యార్థులు మొదటి 10 శ్లోకాలు పఠించాల్సి ఉంటుందని తెలిపారు. ఆరేడు తరగతుల విద్యార్థులు అదే అధ్యాయంలోని 20 శ్లోకాలు, ఉన్నత విభాగంలో మొదటి 20 శ్లోకాలతో పాటు అర్థాలు కూడా చెప్పాల్సి ఉంటుందన్నారు. ఇదిలా ఉండగా పొగిరి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు భగవద్గీత పుస్తకాలను మంగళవారం పంపిణీ చేశారు.

కరాటేలో పతకాలు

కొత్తవలస, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 17న విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీలలో కొత్తవలసకు చెందిన లక్ష్మీదీపక్ అండర్-17 విభాగంలో రెండు వెండి పతకాలను సాధించాడు. ఆ విద్యార్థిని శిక్షకుడు కె.సూర్య నూకరాజు అభినందించారు.

చీపురుపల్లి విద్యార్థులకు..

చీపురుపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన చిన్నారులు రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. విజయవాడలో ఈ నెల 17న జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో చీపురుపల్లి కరాటే అకాడమీ విద్యార్థుల బహుమతులు పొందారు. ఈ విద్యార్థులను, మాస్టర్ శేఖర్‌లను జడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు అభినందించారు.

రోడ్డు పనులు పరిశీలన

గజపతినగరం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక జాతీయ రహదారి నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్లే సర్వీసు రోడ్డు సర్వే పనులను విజయనగరం ఆర్డీఓ బి.కీర్తి మంగళవారం పరిశీలించారు. జిరాయితీ భూములకు సంబంధించి సర్వే చేశారు. గతంలో రైల్వే మూడో లైన్ పనుల్లో భవనాలు కోల్పోయిన వారికి పరిహారంపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో రైల్వే డీజీఎం శరత్, డీటీ భవ్య, సర్వేయర్ భవాని తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

కొత్తవలస, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఏపీయూటీఎఫ్ మండల శాఖ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. మండల శాఖ అధ్యక్షురాలుగా సీహెచ్ నిర్మలాదేవి, ప్రధాన కార్యదర్శిగా జి.విజయగౌరి ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షునిగా ఎస్ఎస్ ప్రసాద్, సహాధ్యక్షులుగా పి.కనకరత్నం, వి.సురేష్ కుమార్, కోశాధికారిగా సీహెచ్ రవికుమార్ ఎన్నికయ్యారు. .జిల్లా కార్యవర్గ సభ్యులుగా టి.వినోద్ కుమార్, పి.మేష్, ఎస్.వాసు, వి.మురళీధర్, కె.విజయబాసన్న, కె.బాపునాయుడులను ఎన్నుకున్నారు. ఆడిట్ కమిటీ సభ్యులుగా పి.సూరిఅప్పారావు, సీహెచ్ అప్పారావు, కె.రామకృష్ణారావు, 8 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

ఘనంగా ఇందిరా జయంతి

నెల్లిమర్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలు మంగళవారం నెల్లిమర్లలో ఘనంగా జరిగాయి. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గంటా సతీష్ ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కనకల పద్మనాభం, సురేష్, ఎస్.పృథ్వీ, మురళి, ప్రశాంత్, శ్రీను పాల్గొన్నారు

ఎస్.కోటలో..

శృంగవరపుకోట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక మహాత్మాగాంధీ పార్కులో మంగళవారం మాజీ ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ జయంతి ఉత్సవాలను నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గేదెల తిరుపతి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. నాయకులు పదాల మణిబాబు, చింతల ఈశ్వరరావు, హెచ్.నానాజీ, బాల నాగు తదితరులు పాల్గొన్నారు.

ఝాన్సీలక్ష్మి జయంతి

చీపురుపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వీర నారి ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి వేడుకలు జనసేన పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి విసినిగిరి శ్రీనివాసరావు ఝాన్సీ లక్ష్మీబాయి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో కింతలి వాసు, పి.త్రినాథరావు, నగేష్, భవాని, సత్య, వసంతకుమారి పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం

సంతకవిటి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండవకురిటి గ్రామంలో పశువైద్యాధికారి సతీష్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత గర్భకోశ వ్యాధుల వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మొత్తం 38 ఆవులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బి.జోతీశ్వరరావు, డాక్టర్ సి.హెచ్ సత్యప్రకాష్, ఏహెచ్ కె.రాజగోపాల్, సీహెచ్ తిరుపతిరావు, డాక్టర్ సుమన్, పాల్గొన్నారు.

అన్నకూటి మహోత్సవం

విజయనగరం రూరల్, నవంబరు 19: (ఆంధ్రజ్యోతి): నగరంలోని సిటీబస్టాండ్‌లో ఉన్న అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం అన్నకూటి మహోత్సవాన్ని నిర్వహించారు. ఏటా కార్తీక పౌర్ణమి తరువాత వచ్చే మంగళవారం అన్నకూటి మహోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ.

ఆర్థిక మోసాలపై సమాచారం అందించండి



బ్యాంకు అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక మోసాలకు సంబంధించిన కేసుల్లో సమయం చాలా ముఖ్యమైనదని.. సకాలంలో బ్యాంకు అధికారులు దర్యాప్తు అధికారులకు సమాచారం అందించాలని ఎస్పీ వకుల్ జిందాల్ కోరారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని సమావేశ మందిరంలో వివిధ బ్యాంకుల మేనేజర్లు, ఇతర అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ సైబర్ మోసాల సంఖ్య రోజురోజుకీ పెరుగుతున్నాయని అన్నారు. కొత్త తరహాలో మోసాలకు పాల్పడుతూ ప్రజల నుంచి డబ్బులు దోచేస్తున్నారని తెలిపారు. ఈ తరహా మోసాలను నియంత్రించేందుకు బ్యాంకు అధికారులు తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో డీఎస్పీలు శ్రీనివాసరావు, రాఘవులు, సీఐలు, వివిధ బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

గిరిజన కో-ఆపరేటివ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా లక్ష్మి



దాసరి లక్ష్మి

శృంగవరపుకోట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గిరిజన కో-ఆపరేటివ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా వేపాడ మండలం సోంపురం గ్రామానికి చెందిన దాసరి లక్ష్మిని నియమించారు. కూటమి ప్రభుత్వం మంగళవారం సాయంత్రం దీనికి సంబంధించిన జాబితాను విడుదల చేసింది. గతంలో ఆమె వేపాడ ఎంపీపీగా బాధ్యతలు నిర్వర్తించారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రామప్రసాద్‌లకు లక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు.

యాదవ కార్పొరేషన్ సభ్యుడిగా లక్ష్మీ వరప్రసాద్



లక్ష్మీ వర ప్రసాద్

విజయనగరం పట్టణానికి చెందిన ప్రసాదుల లక్ష్మీవరప్రసాద్‌కు రాష్ట్ర యాదవ కార్పొరేషన్ సభ్యుడిగా కూటమి ప్రభుత్వం నియమించింది. ఆయన కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు, ప్రస్తుత ఎమ్మెల్యే అదితి గజపతిరాజులకు ప్రధాన అనుచరుడు. ఆయన తండ్రి ప్రసాదుల రామకృష్ణ మున్సిపల్ చైర్మన్‌గా, తల్లి కనకమహాలక్ష్మి కార్పొరేటర్‌గా వ్యవహరించారు.

నూతన వంగడాలతో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న వీసీ శారద జయలక్ష్మీ దేవి

డెంకాడ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నూతన వంగడాల సాగుతో అధిక దిగుబడులు సాధించవచ్చునని ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం ఉప కులపతి శారద జయలక్ష్మీ దేవి తెలిపారు. మండల కేంద్రంలోని అభ్యుదయ రైతు పాణిరాజు వ్యవసాయ క్షేత్రంలో రైతులకు క్షేత్ర పర్యటన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ ఆర్.శారద జయలక్ష్మీదేవి మాట్లాడుతూ, రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను పాటించాలని సూచించారు. పరిశోధన సంచాలకులు డాక్టర్ పీవీ సత్యనారాయణ మాట్లాడుతూ ఎంటీయూ 1310 వరి రకాన్ని అభివృద్ధి చేసి రైతులకు అందించినట్టు తెలిపారు. విచక్షణ రహితంగా రసాయన ఎరువుల వాడడం వల రైతులకు సాగు ఖర్చులు అధికమవుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి వీటీ రామారావు, విజయనగరం ఏడీఏ నాగభూషణం, సీనియర్ టీడీపీ నాయకులు కంది చంద్రశేఖర్‌రావు, ఎంఎంవీ శ్రీనివాస్, డాక్టర్ పాత్రో, డాక్టర్ ముకుంద, పి.నిర్మల తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత ప్రాధాన్యాన్ని గుర్తించాలి



మాట్లాడుతున్న కొల్ల కృష్ణారావు

రాజాం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పరిసరాలు పరిశుభ్రతగా ఉండాలను కోవడం మన హక్కు అని రొటేరియన్ కొల్ల కృష్ణారావు, గట్టి పాపారావు అన్నారు. టాయిలెట్స్ డే సందర్భంగా స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం మరుడుదొడ్ల వాడకం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. దీనిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రోటేరియన్ సప్పటి వసంతరావు, వికాస తరంగణి అధ్యక్షులు టీటీడీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయండి

లక్కవరపుకోట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పనుల్లో వేగం పెంచాలని అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ శారదాదేవి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎల్.కోటలో వేపాడ, ఎల్.కోట మండలాల ఏపీవో, ఈసీ, టెక్నికల్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీసీ రోడ్లు, డ్రైన్లు, పశువుల షెడ్లు, గ్రావెల్ , మెటల్ రోడ్ల పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏపీవో విజయలక్ష్మి, యుగేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

రాజాం రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తి జీవితంపై విరక్తితో పురుగుల మందు తాగి మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు సోపేరు గ్రామానికి చెందిన కోటగిరి మధు (48) ఈనెల 18న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీన్ని గుర్తించిన కుటుంబ సభ్యులు రాజాంలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళంలోని రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈనెల 18న రాత్రి మృతి చెందాడు. మృతుడి సోదరుడు అశోక్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ. నరసింహమూర్తి తెలిపారు.

వివాహిత అదృశ్యం

రాజాం రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తన భార్య మమాలీ సాహు ఈనెల 18 నుంచి కనిపించడం లేదని ఒడిశాలోని కటక్‌కు చెందిన అరత్‌సాహు మంగళవారం రాజాం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొంతకాలంగా పట్టణంలోని వస్త్రపురి కాలనీలో భార్యతో కలిసి ఉంటున్న ఆరత్‌సాహు సమీప జూట్ కర్మాగారంలో పనిచేస్తున్నారు. సోమవారం సాయంత్రం విధులు ముగించుకుని ఇంటికి వచ్చేసరికి భార్య కనిపించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎస్.ఐ. రవికిరణ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో కార్యదర్శి మృతి

గరివిడి (మెరకముడిదాం), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మెరకముడిదాం మండలం రామయ్యవలస పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న బి.అప్పలనాయుడు (42) మంగళవారం ఉదయం గుండెపోటుతో మృతిచెందారు. అప్పలనాయుడు గుర్ల మండలం గరికివలస గ్రామంలో నివాసం ఉంటున్నారు. తెల్లవారుజామున గుండెనొప్పి రావడంతో కుటుంబ సభ్యులు విజయనగరం ప్రైవేటు ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందారు. ఆయనకు భార్య శైలజ, ఒక బాబు, పాప ఉన్నారు.

పాలవలసలో చోరీ



బాధితులతో మాట్లాడుతున్న పోలీసులు

గుర్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పాలవలస గ్రామంలోని తాడి గౌరి నాయుడు ఇంటిలో మంగళవారం మధ్యాహ్నం చోరీ జరిగింది. ఎవరూ లేని సమయంలో దొంగలు ఇంట్లోకి ప్రవేశించి బీరువా పగులగొట్టి అందులో ఉన్న బంగారు ఆభరణాలు, డబ్బులు అపహరించినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ నారాయణరావు తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని పరిసరాలను పరిశీలించారు. గౌరినాయుడు ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఉదయాన్నే తాను పనిలోకి వెళ్లిపోయాడు. ఆయన భార్య నెలిమర్ల వెళ్లిపోయింది. వారి ఇద్దరు కుమారులు పాఠశాలకు వెళ్లిపోయారు. ఆ సమయంలో చోరీ జరిగినట్లు తెలిపారు. ఇంట్లో సుమారు 9 తులాల బంగారం, రూ.90వేల నగదు ఉన్నట్లు బాధితులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉందని ఎస్ఐ నారాయణరావు తెలిపారు.

సోషల్‌మీడియా పోస్టులపై ఫిర్యాదు



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

గుర్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌లపై సోషల్ మీడియాలో ఫొటోలు మార్ఫింగ్ చేసి పోస్టు చేసిన వ్యక్తి షేక్‌గౌస్‌పై స్థానిక పోలీసులకు ఫిర్యాదు అందింది. నిందితుడిని వెంటనే అరెస్టు చేయాలని నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షులు నాగులపల్లి నారాయణరావు, పార్లమెంట్ ఐటీడీపీ అధ్యక్షురాలు కె.విమలారాణి స్థానిక ఎస్ఐ నారాయణరావుకు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగు యువత అధ్యక్షులు పైడినాయుడు తదితరులు పాల్గొన్నారు.

గంజాయితో నిందితుడి అరెస్టు



నిందితుడితో డీఎస్పీ శ్రీనివాసరావు తదితరులు

విజయనగరం క్రైం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ద్వారపూడి గ్రామ శివార్లలో ఈ నెల 12న ముగ్గురు వ్యక్తులు గంజాయి విక్రయించారు. వారిలో ఇద్దరిని వెంటనే అరెస్టు చేయగా.. మరో నిందితుడు భువనేశ్వర్‌కు చెందిన రాజేష్‌బాగ్‌ను తాజాగా విజయనగరం రైల్వే స్టేషన్ వద్ద అదుపులోకి తీసుకున్నట్టు పోలీసులు తెలిపారు. అతని నుంచి రెండు కిలోల గంజాయిని, రూ.210 నగదు, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కేసులో క్రియాశీలకంగా వ్యవహరించిన విజయనగరం రూరల్ సీఐ లక్ష్మణరావు, ఎస్ఐ అశోక్‌కుమార్, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

రైలు ఢీకొని 80 గొర్రెల మృతి



మృతిచెందిన గొర్రెలు

జామి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): యాతపాలెం వద్ద రైలు ఢీకొని 80 గొర్రెలు మృతి చెందాయి. బాధితుల కథనం మేరకు వివరాలివీ... లక్ష్మీపురం గ్రామానికి చెందిన వ్యక్తులు తమ గొర్రెలను మేత కోసం అన్నం రాజుపేట తీసుకెళ్లారు. మంగళవారం మధ్యాహ్నం తిరిగి వాటిని తమ గ్రామానికి తీసుకెళ్తున్నారు. యాతపాలెం చేరుకున్న సమయంలో అక్కడ ఉన్న కుక్కలు దాడికి యత్నించడంతో భయపడిన గొర్రెలు సమీపంలో ఉన్న రైలు పట్టాలపైకి పరుగెత్తాయి. అదే సమయంలో వచ్చిన రైలు గొర్రెలను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 80 గొర్రెలు సంఘటన స్థలంలో మృత్యువాత పడ్డాయి. మరో 40 వరకు గొర్రెలు గాయపడ్డాయి. వీటి కాపరులు గొలగాని ఎర్నాయుడు, గొలగాని సింహాచలం, వారాది రమణమ్మ, గొంప బంగారునాయుడులు తీవ్రం రోదిస్తున్నారు. వీటి విలువ సుమారు 20లక్షలు ఉంటుందని తెలిపారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

చెరువును పూడ్చేస్తున్నారు



చెరువును పూడ్చేస్తున్న దృశ్యం

భోగాపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి సమీపంలోని అమటాంరాయవలస వెళ్లే రహదారికి సమీపంలో ఉన్న చెరువును కొంతమంది మట్టితో పూడ్చేస్తున్నారు. ఆక్రమణలో భాగంగా చెరువును పూడ్చుతున్నా... అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి..చెరువు ఆక్రమణకు గురికాకుండా కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

ఉత్సాహంగా వన సమారాధన

భోగాపురం, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): భోగాపురం సమీపంలో శ్రీకామాక్షి విశ్వబ్రాహ్మణ సహకార సంఘం ఆధ్వర్యంలో మంగళవారం వన మహోత్సవం నిర్వహించారు. సుమారు 400 మంది ఒకే చోట కలిసి సరదాగా గడిపారు. అనంతరం అందరూ కలిసి భోజనాల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు పోలవరపు ప్రకాష్, నాయకులు కుప్పిలి నారాయణరావు పాల్గొన్నారు.

గుళ్లపాడు ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ



ఫీల్డ్ అసిస్టెంట్‌ను విచారిస్తున్న ఎంపీడీవో

రేగిడి, నవంబరు 19: (ఆంధ్రజ్యోతి): గుళ్లపాడు ఫీల్డ్ అసిస్టెంట్ మంగమ్మపై ఎంపీడీవో శ్యామల కుమారి మంగళవారం విచారణ చేపట్టారు. తప్పుడు మస్తర్ల నమోదు, 13 మందికి ఉద్దేశపూర్వకంగా జాబ్ కార్డులు జారీ చేయకపోవడం తదితర అభియోగాలపై డుమా అధికారులకు గ్రామానికి చెందిన ముంజేటి జగన్మోహన్‌రావు, వేతనదారులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎంపీడీఓ గ్రామానికి వచ్చి ఫీల్డ్ అసిస్టెంట్‌తో పాటు ఫిర్యాదుదారులతో మాట్లాడారు. డుమా అధికారులకు నివేదిక పంపిస్తానని ఎంపీడీవో తెలిపారు. ఈ విచారణలో ఏపీఓ హరనాథ్, ఈసీ రామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటి లెక్క పక్కా!

(ఏవో పేజీ తరువాయి)



గరివిడి మండలంలో హౌస్ హోల్డ్ సర్వేలో సిబ్బంది

పరిగణలోకి తీసుకుంది. ఈ విధానంతో ఏ వ్యక్తి ఎక్కడ ఉన్నారో క్షణాల్లో తెలిసిపోతుంది. ఆ వ్యక్తి, కుటుంబసభ్యులు, రేకింట్లో ఉన్నారా? డాబా ఇంట్లో నివాసముంటున్నారా? వీధి సమాచారంతో సహా మొత్తం అధికారుల లాగిన్లో కనిపిస్తాయి. మ్యాపుల్లో వారు ఉండే ప్రదేశం సైతం కనిపిస్తుంది. తద్వారా విపత్తుల సాయంలో సత్వర సాయం కూడా అందించవచ్చు.

చాలా ప్రయోజనాలు

ప్రస్తుతం కొనసాగుతున్న హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్‌తో బహుళ ప్రయోజనాలు ఉన్నాయి. గతంలో ఏదైనా సమస్యపై ఫిర్యాదుచేస్తే సంబంధిత వ్యక్తి ఆధార్ నంబర్, ఫోన్ నంబరు, ఇంటి నంబరు అందించాల్సి వచ్చేది. వాటిని నమోదు చేసుకుని సమస్య పరిష్కారాం కోసం వారిని ఆశ్రయించాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు ఈ జియో ట్యాగింగ్‌తో వ్యక్తికి సంబంధించి ఏదైనా ఒక్క ఆధారంతో క్షణాల్లో నేరుగా వివరాలు పొందవచ్చు. మ్యాపింగ్ ద్వారా ఇట్టే తెలుసుకోవచ్చు. మరోవైపు చాలా మంది బ్యాంక్ ఖాతాలకు ఆధార్, ఫోన్ నంబర్లు అనుసంధానం కాలేదు. ఎవరెవరైతే ఇలా అనుసంధానం కాలేదో.. వారి వివరాలు సచివాలయ ఉద్యోగుల వద్ద ఉన్నాయి. పనిలో పనిగా వాటిని సైతం అనుసంధానం పూర్తిచేస్తున్నారు. ఈ జియో ట్యాగింగ్‌తో చాలారకాలుగా ప్రయోజనాలున్నాయి. వాటిని సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం జిల్లా ప్రజలపై ఉంది.

అనారోగ్య సమస్యలుంటే తెలియజేయాలి



రిమాండ్ ఖైదీలతో మాట్లాడుతున్న సన్యాసినాయుడు

పాలకొండ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రిమాండ్ ఖైదీలకు ఏమైనా అనారోగ్య సమస్యలుంటే వెంటనే జైలు సూపరింటెండెంట్ బి.జోగులుకు తెలియజేయాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. పాలకొండ సబ్‌జైలును పాలకొండ జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎ.విజయరాజ్‌కుమార్‌తో కలిసి ఆయన మంగళవారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన రిమాండ్ ఖైదీలతో మాట్లాడారు. వారిపై ఉన్న కేసులపై ఆరా తీశారు. అనంతరం జైలు ప్రాంగణంలో ఉన్న టాయిలెట్లు, బాత్‌రూం, కిచెన్ స్టోర్‌రూమ్‌లు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హెడ్ వార్డర్ పి.చంద్రరావు, లీగల్ అడ్వయిజరీ కుమార్‌స్వామి, పోలీస్ సెక్యూరిటీ గార్డు రిప్పన్‌రావు, జైలు సిబ్బంది హేమసుందర్, సత్యారావు, నరసింహులు, జూనియర్ అసిస్టెంట్, కోర్టు సిబ్బంది ఉన్నారు.

తోటపల్లి పనుల డిజైన్‌పై స్పష్టత ఇవ్వాలి

పాలకొండ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి ఆధునికీకరణ పనుల డిజైన్‌పై స్పష్టత ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు కోరారు. ఈ మేరకు మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. ఖరీఫ్, రబీ సీజన్‌లో అవసరమైన నీరు రాక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో తోటపల్లి కాలువలు, ఓనిగెడ్డ అనుసంధానం చేయడానికి రూ.7.50కోట్లు, పాత ఆయకట్టు కాలువల మరమ్మతులకు రూ.7.50 కోట్లు కేటాయించి పనులు చేపట్టారని, తర్వాత వచ్చిన ప్రభుత్వాలు నిధులు ఇవ్వకపోవడంతో పనులు ఆగిపోయాయన్నారు. ప్రజా ప్రతినిధులు స్పందించాలని కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘం నాయకులు అప్పలనాయుడు, రమణమూర్తి, కిమిడి రామ్మూర్తినాయుడు పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో పనిచేయండి

పార్వతీపురంటౌన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఆ ఉద్యోగుల ప్రత్యేకాధికారి, సెట్విజ్ సీఈవో రామ్‌గోపాల్ అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గల సమావేశ మందిరంలో సచివాలయాల ఉద్యోగులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జియో ట్యాగింగ్, తదితర సర్వేల నిర్వహణలో పక్కాగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరాజు, మేనేజర్ లక్ష్మి పాల్గొన్నారు.

సారా ప్యాకెట్లు స్వాధీనం

పార్వతీపురంటౌన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణం, పెదబొండపల్లిలో మంగళవారం వేర్వేరుగా జరిపిన దాడుల్లో 700 సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ సీఐ సురేష్ తెలిపారు. పెదబొండపల్లి సమీపంలో అడారు గ్రామం నుంచి అదే గ్రామానికి చెందిన ఎం.శ్రీరాములు 600 సారా ప్యాకెట్లు తీసుకువస్తుండగా పట్టుకున్నామని చెప్పారు. సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించామన్నారు. పట్టణంలో 100 సారా ప్యాకెట్లుతో గొడగల వీధికి చెందిన బొత్స హరికృష్ణను పట్టుకుని కేసు నమోదు చేశామని చెప్పారు.

బీవీ పురం పింఛన్లపై విచారణ

గరుగుబిల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బురదవెంకటాపురం పంచాయతీలో పలువురు అనర్హులు పింఛన్లు పొందుతున్నారంటు అందిన ఫిర్యాదుల మేరకు మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు విచారణ నిర్వహించారు. ఈ విచారణకు 55 మంది హాజరు కావాల్సి ఉండగా 48 మంది హాజరయ్యారు. ఇందులో 46 మంది పింఛన్‌దారులు అర్హులుగా తేలారని ఎంపీడీవో జి.పైడితల్లి తెలిపారు. అదేవిధంగా దివ్యాంగుల పించన్లకు సంబంధించి వైద్యాధికారులు ఇచ్చిన ధ్రువీకరణ పత్రాల అనంతరం అర్హులైన వారికి పింఛ న్లు మంజూరు చేస్తామని చెప్పారు. ఇదిలాఉండగా తాము పింఛన్లకు అర్హులైన

సీఎంను కలిసిన తెంటు

బాడంగి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు మంగళవారం అమరావతిలో సీఎం చంద్రబాబును కలిశారు. ఈసందర్భంగా ఆయన కు శాలువతో సత్కరించారు.



సీఎంను సత్కరిస్తున్న లక్ష్మునాయుడు

ఈపీఎఫ్ రూ.9 వేలు ఇవ్వాలి

గరివిడి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఈపీఎఫ్ కనీసం రూ.9వేలు ఇవ్వాలని సీఐటీయూ గరివిడి డివిజన్ నాయకుడు ఎ.గౌరి నాయుడు డిమాండ్ చేశారు. పెన్షన్ పెంపుపై ప్రధానమంత్రి మోదీ ప్రభుత్వం మొండి వైఖరిని విడనాడాలని డిమాండ్ చేస్తూ మంగళవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.9వేలు కనీస పెన్షన్ ఇవ్వాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కేంద్ర ప్రభుత్వం అమలు చేయడం లేదని విమర్శించారు. సంఘ నాయకులు సలీమ్, మూర్తి, గంట్యాడ అప్పలరాజు, కరణం సన్యాసినాయుడు, శనపతి పాపినాయుడు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న పెన్షన్‌దారులు

చెక్‌డ్యామ్‌లు ఇలా.. సాగునీరు ఎలా?

- ఐదేళ్లగా మరమ్మతులకు నోచుకోని వైనం
- ఆందోళన వ్యక్తం చేస్తున్న గిరిజన రైతులు

గుమ్మలక్ష్మీపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో ఉన్న చెక్‌డ్యామ్‌లు నిధుల కొరత కారణంగా మరమ్మతులకు నోచుకోవడం లేదు. దీంతో గిరిజన రైతులు సాగునీటికి అవస్థలు పడు తున్నారు. గత ఐదేళ్లలో ఒక్కసారి కూడా మరమ్మతులు చేయకపోవడంతో ఈ చెక్‌డ్యామ్‌ల పరిధిలోని ఆయకట్టు రైతులు తమ పొలాలకు సక్రమంగా సాగునీరు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జీఎంవలస, కొమరాడ పాచిపెంట, మక్కువ, సాలూరు గిరిజన మండలాల్లో సుమారు 200 వరకు చెక్‌డ్యామ్‌లు నిర్మించారు. ఈ చెక్ డ్యామ్‌లను ఐపాడ్ టీటీజీ యాక్షన్ ప్లాన్ ఎస్టీ సబ్‌ప్లాన్, ఉపాధి హామీ, మైనర్ ఇరిగేషన్ రాష్ట్రీయ సంవికాస్ యోజన తదితర పథకాలతో పదేళ్ల కిందట నిర్మించారు. వీటితో గిరిజన రైతుల ఆయకట్టు భూమికి పుష్కలంగా సాగునీరు అందేది. వరి, ఇతర వేసవి పంటలు కూడా పండించేవారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ చెక్‌డ్యామ్‌ల నిర్వహణ మరమ్మతుల కు నిధులు కేటాయించనందున కాలువల్లో పూడికలు పెరిగిపోయాయి. ఆయకట్టు రైతులకు నీరందని పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వంలోనైనా గిరిజన ప్రాంతంలోని చెక్‌డ్యామ్‌ల మరమ్మతులకు పెద్దఎత్తున నిధులు కేటాయిస్తారని గిరిజన రైతులు ఎదురు చూస్తున్నారు. గుమ్మలక్ష్మీపురం మండలం మంజరపు గోడ, బుద్డిడి సీమలగూడ, మండ, గాంధ్ర, జేకేపాడు తదితర ప్రాంతాల్లో పెద్ద చెక్‌డ్యామ్‌లు కూడా నిర్మించారు. కనీస నిర్వహణ జరగలేదు. ప్రభుత్వం స్పందించి చెక్‌డ్యామ్‌ల మరమ్మతులకు పెద్దఎత్తున నిధులు కేటాయించాలని రైతులు కోరుతున్నారు.

వినతిపత్రాలు సమర్పించాం

గిరిజన ప్రాంతంలోని చెక్‌డ్యామ్‌లో మరమ్మతులు చేయాలని సంబంధిత ఇరిగేషన్ అధికారులకు, ఐటీడీఏ అధికారులకు వినతిపత్రాలు సమర్పించాం. అయినా మరమ్మతులకు నిధులు మంజూరు కాలేదు.

- కోలక అవినాష్, గిరిజన సంఘ నాయకుడు

నేరేడుమానుగూడ వద్ద ఉన్న చెక్‌డ్యామ్ పరిస్థితి ఇలా..



ప్రతిపాదనలు పంపించాం

పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో ఉన్న చెక్‌డ్యామ్‌ల మరమ్మతులకు ప్రతిపాదనలు తయారు చేసి, ఇంజినీరింగ్ ఉన్నతాధికారులకు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

- అప్పారావు, అసిస్టెంట్ ఇంజినీర్, భద్రగిరి, గిరిజన సంక్షేమశాఖ

ఆస్పత్రుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

పార్వతీపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రతిపాదించిన జాతీయ నాణ్యతా ప్రమాణాలను ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అమలు చేయాలని స్టేట్ ప్రోగ్రాం అధికారి డా.పి.రమాదేవి తెలిపారు. ఈ మేరకు ఐటీడీఏ గిరిమిత్ర సమావేశ మందిరంలో వైద్యాధికారులు, సీహెచ్‌వోలకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పీహెచ్‌సీలు, సబ్ సెంటర్ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లలో మౌలిక సదుపాయాలు, పరిశుభ్రత విషయంలో మార్గదర్శకాలు పాటించాలన్నారు. శిక్షణ పొందిన వైద్యాధికారులు, సీహెచ్‌వోలు వారి పరిధిలో వైద్య సిబ్బందికి శిక్షణ ఇస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ఎన్‌క్యూఏసీ కన్సల్టెంట్ డా.జి.నరేంద్రకుమార్, డీపీఎంవో డా.రఘుకుమార్, జిల్లా ప్రోగ్రాం అధికారి టి.జగన్మోహన్, జిల్లా క్వాలిటీ కన్సల్టెంట్స్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ట్యాంకుల మరమ్మతులకు ప్రతిపాదనలు

పార్వతీపురం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మంచినీటి ట్యాంకుల మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని గ్రామీణ నీటి సరఫరా జిల్లా అధికారి ఓ.ప్రభాకరరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఇటీవల ప్రచురితమైన 'లీకవుతున్నా పట్టించుకోరా' అనే వార్తకు ఆయన స్పందించారు. గుమ్మలక్ష్మీపురం మండలం ఇరిడి పంచాయతీ, కొత్తగూడ గ్రామంలో 357 మంది జనాభా ఉన్నారని చెప్పారు. ఈ గ్రామంలో 10కే ఎల్‌పీడబ్ల్యూఎస్ పథకం పాడయ్యిందని, వాటి మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని చెప్పారు. రూ.48లక్షలతో గ్రామ పంచాయతీ అభివృద్ధి పథకం జాబితా చేర్చామన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

జిల్లాలోని అన్ని పత్తి కేంద్రాల్లో కొనుగోలు

పార్వతీపురం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని మండలాల్లో ఉన్న పత్తి కొనుగోలు కేంద్రాల్లో పత్తిని కొనుగోలు చేస్తామని జిల్లా అగ్రిటెడ్, మార్కెటింగ్‌శాఖ అధికారి ఐ.గంగాధరరావు తెలిపారు. ఆదివారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో వచ్చిన కలిసిరాని పత్తి అనే కథనానికి ఆయన మంగళవారం స్పందించారు. సాలూరు మార్కెట్ యార్డులో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఈనెల 8న ఇండియా కాటన్ కార్పొరేషన్ సంస్థ ప్రారంభించిందని చెప్పారు. పత్తి రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. పత్తిని విక్రయించిన రెండు రోజుల్లోనే రైతు బ్యాంకు ఖాతాలో నగదు జమ అవుతుందని తెలిపారు.



మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

పని భారం తగ్గించాలి

పార్వతీపురంటౌన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కాంట్రాక్టు కార్మికులపై పనిభారం తగ్గించాలని సీఐటీయూ నాయకుడు జీవీ రమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద కాంట్రాక్టు కార్మికులు నిరసన చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు పనిముట్లు ఇవ్వకపోతే ఎలా పనిచేస్తారని ప్రశ్నించారు. విజయవాడ వరద బాధితులకు సేవలందించిన 20మంది కార్మికులకు ఇప్పటివరకు టీఏ, డీఏలు ఇవ్వలేదన్నారు.

నూతన బోధనా పద్ధతులు అమలు చేయాలి

బలిజిపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో అవగాహన చేసుకున్న నూతన బోధనా పద్ధతులను పాఠశాలల్లో అమల చేయాలని ఎంఈవో-1 సామల సింహాచలం అన్నారు. బలిజిపేట స్కూల్ కాంప్లెక్స్‌ను ఆయన మంగళవారం సందర్శించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు సులభ రీతిలో అర్థమయ్యే విధంగా బోధన చేయాలని సూచించారు. ప్రతి ఉపాధ్యాయుడు టీచర్స్ డైరీ, లైసెన్స్ ప్లాన్స్ తయారు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం పి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యా సామర్థ్యాల పెంపునకు కృషి చేయాలి

గరుగుబిల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా సామర్థ్యాలను పెంచేందుకు కృషి చేయాలని ఎంఈవో దత్తి అప్పలనాయుడు సూచించారు. మంగళవారం గరుగుబిల్లి జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో పాఠశాలల సముదాయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి ఆపార్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు. రానున్న పదో తరగతి పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో హెచ్‌ఎం ఎస్‌ఎల్ పాత్రుడు పాల్గొన్నారు.

సర్వే పూర్తి చేయాలి

సాలూరు రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చికెన్‌గున్యా, డెంగ్యూ ప్రబలుతున్న నేపథ్యంలో నిర్వహిస్తున్న సర్వేను సత్వరం పూర్తి చేయాలని జిల్లా మలేరియా అధికారి సూర్యనారాయణ సూచించారు. ఆయన మంగళవారం బాగువలసలో పర్యటించి, చికెన్‌గున్యా బాధితురాలిని పరామర్శించారు. గ్రామంలో జ్వరాల ఉధృతిపై వైద్య సిబ్బందిని ప్రశ్నించారు. గ్రామానికి ఆనుకుని గుబేలుగెడ్డ ఉన్నందున దోమల లార్వా పెరిగే అవకాశాలు ఉన్నాయని జిల్లా కన్సల్టెంట్ రామచంద్ర వివరిం చారు. బాగు వలస పీహెచ్‌సీని పరిశీలించా రు. పీహెచ్‌సీకి వచ్చే జ్వరపీడితులపై వైద్యా ధికారి రవికిరణ్ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

వరి పంట దగ్ధం

బలిజిపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కూర్మనాథపురం రెవెన్యూ పరిధిలో మంగళవారం సంభవించిన అగ్ని ప్రమాదంలో వరి పంట కాలిబూడిదయ్యింది. స్థానికులు అందించిన సమాచారం మేరకు.. కూర్మనాథపురం గ్రామానికి చెందిన బౌరోతు లక్ష్మణరావు పొలంలో ఉన్న వరి పంట అగ్నికి ఆహుతయ్యింది. సర్వే నెంబరు 354లో 54 సెంట్లు భూమిలో సాగు చేసిన వరి పంట ప్రమాదశాత్తూ కాలి బూడిదయ్యింది. పొలంలో మంట పెట్టడంతో వరి పంటకు వ్యాపించి కాలిపోయినట్టు స్థానికులు తెలిపారు. చేతికి అంది వచ్చిన పంట కాలిపోవడంతో బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు రూ.20వేలు నష్టం వాటిల్లిందని తెలిపారు.

నిరాశలో చెరకు రైతు

- తెరుచుకోని చక్కెర కర్మాగారాలు
- నేటి నుంచి సంకిలిలో క్రషింగ్



బొబ్బిలి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి సమీపంలో లచ్చయ్యపేట ఎన్‌సీఎస్, భీమసింగి సహకార చక్కెర కర్మాగారాలు తెరచుకోక పోవడంతో చెరకు రైతులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. క్రషింగ్ సీజన్ నేపథ్యంలో చెరకు రైతులు ఇబ్బందులు ఎదుర్కోవల్సి వస్తోంది. గతంలో మాదిరిగానే చెరకును సంకిలి ఫ్యాక్టరీకి తరలించుకోవాల్సి వస్తోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చక్కెర కర్మాగారాల విషయంలో ఎన్నో హామీలు గుప్పించారు. కర్మాగారాలైతే తెరుచుకోలేదు. రైతులకు అవస్థలు తప్పలేదు.

- సంకిలి ఫ్యాక్టరీలో బుధవారం నుంచి క్రషింగ్ ప్రారంభం కానున్నది. ఈ ఏడాది చెరకు మద్దతు ధర రూ.2,150గా నిర్ణయించారు. సంకిలి, లచ్చయ్యపేట, భీమసింగి ఫ్యాక్టరీల పరిధిలో మొత్తం 4.10 లక్షల టన్నుల చెరకును ఈ ఏడాది క్రషింగ్ చేయనున్నట్లు అంచనా వేస్తున్నారు.

తగ్గిన సాగు విస్తీర్ణం

ఈ ఏడాది లచ్చయ్యపేట ఫ్యాక్టరీ పరిధిలోని 15 మండలాల్లో 16.33 హెక్టార్లు, భీమసింగి పరిధిలో 212.69 హెక్టార్లు, సంకిలి పరిధిలో 4622.66 హెక్టార్లలో మొత్తం 6,468.55 హెక్టార్లలో చెరకు పంట సాగు చేశారు. 2021-22 సీజన్‌లో 9,472.03 హెక్టార్లలో సాగు చేశారు. ఇలా పంట సాగు విస్తీర్ణం ప్రతి ఏటా గణనీయంగా తగ్గుతోంది.

చెరకు తూనిక కేంద్రాలను పెంచాం

గత సీజన్‌లో కన్నా ఈ ఏడాది చెరకు తూనిక కేంద్రాల సంఖ్యను 13కి పెంచాం. దళారీ వ్యవస్థను పూర్తిగా రూపుమాపాం. 25 నుంచి 30 టన్నుల పైగా మొక్క చెరకు పంటను ఇచ్చిన రైతులకు అదనంగా టన్నుకు రూ.200, మమ్ము చెరకుకు రూ.100 చొప్పున చెల్లిస్తారు. సంకిలి ఫ్యాక్టరీకి చెరకు రవాణాకు గాను 75 కిలోమీటర్ల దూరం ఉంటుంది. రైతులు 35 కిలోమీటర్ల వరకు రవాణా చార్జీలు భరించాల్సి ఉంటుంది. ప్రతి 15 రోజులకోసారి చెల్లింపులు జరుగుతాయి.

- జీవీవీ సత్యనారాయణ, డిప్యూటీ కేన్ కమిషనర్, బొబ్బిలి

ఘనంగా ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి



ఝాన్సీ లక్ష్మీబాయి చిత్రపటానికి పూలమాల వేస్తున్న జనసేన వీర మహిళలు, నాయకులు

బొబ్బిలి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలిలోని జనసేన పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో మంగళవారం ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బొబ్బిలికి చెందిన ఝాన్సీ వీర మహిళా విభాగం సభ్యులు.. జనసేన పార్టీ రాష్ట్ర కార్యక్రమాల నిర్వహణ కార్యదర్శి బాబు పాలూరు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి, ఝాన్సీ లక్ష్మీబాయి చిత్రపటానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉత్తరాంధ్ర మహిళా రీజనల్ కో ఆర్డినేటర్ తుమ్మి లక్ష్మీరాజ్, బాబు పాలూరు.. పలువురు వీర మహిళలకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వీర మహిళలు మాత గాయత్రి, పాలూరు చాందిని, బంటుపల్లి దివ్య, భద్రగారి సత్య, గైనేడి రమ్య, తులసి యామని, యందువ యామిని, సంతోషి, దుర్గ, రేవళ్ల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

గిరిజన కార్పొరేషన్‌కో ఆపరేటివ్ డైరక్టర్‌గా నిబ్రం

పాలకొండ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ నియోజకవర్గ కన్వీనర్ నిమ్మల నిబ్రంకు గిరిజన కార్పొరేషన్ కోపరేటివ్ డైరక్టర్ పదవి దక్కింది. ఈ మేరకు కూటమి ప్రభుత్వం మంగళవారం రాత్రి ఉత్తర్వులు విడుదల చేసింది.

జీసీసీ అధ్యక్షుడిగా రామారావు

సీతంపేట రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గిరిజన కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (జీసీసీ) సంఘం నూతన పాలకవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. స్థానిక జీసీసీ కార్యాలయంలో నిర్వహించిన ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా కూరంగి రామారావు, ఉపాధ్యక్షుడిగా మూటక ఎండయ్య, మటక రత్నాలమ్మ, డైరక్టర్‌గా ఊయక సింహాద్రి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

జగనన్న కాలనీలో తాగునీరు సరఫరా

పాలకొండ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): లుంబూరు వద్ద జగనన్న కాలనీలో మంగళవారం ట్యాంకుల ద్వారా తాగునీరు సరఫరా చేశారు. ఇటీవల ప్రజా సమస్యల పరిష్కార వేదికలో టీడీపీ నాయకుడు పల్లా కొండలరావు కాలనీవాసులకు ఇచ్చిన హామీ మేరకు రోజుకు రెండు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తున్నారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సచివాలయాన్ని వినియోగంలో తీసుకు రండి

వీరఘట్టం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): దశమంతుపురం గ్రామ సచివాలయ భవనం నిర్మించి చాలా నెలలు గడుస్తున్నప్పటికీ వినియోగంలోకి తీసుకు రావడం లేదని టీడీపీ నాయకుడు కుమారస్వామి అన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఈ సచివాలయ భవనాన్ని గత వైసీపీ హయాంలో పూర్తి చేశారని, అయితే ఇప్పటికీ తాళాలు వేసి ఉన్నాయని చెప్పారు. దీనికి కారణం నిర్మాణానికి సంబంధించిన బిల్లులు ఇంకా మంజూరు కాలేదని ఆయన తెలిపారు. దీనిపై సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశానని చెప్పారు.

ఇందిరా గాంధీకి నివాళి

కురుపాం, నవంబరు19(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా కురుపాంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అడ్డాకుల చిన్నారావు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కాంగ్రెస్ నాయకులు పత్తిక లక్ష్మయ్య, రామారావు తదితరులు పాల్గొన్నారు.

- పాలకొండ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా మంగళవారం స్థానిక మార్కెట్ జంక్షన్‌లో ఉన్న ఆమె విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ పార్వతీపురం నియోజకవర్గ సమన్వయ కర్త బత్తిన మోహన్ పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. పార్టీ నాయకులు సుంకరి శ్రీనివాసరావు, బల్లంకి శంకర్, గడే రాజు, వారణాసి మణికుమారి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.